కథ

# షాక్

కొమ్మద్ది అరుణారమణ



చిలకాగోరింకల దగ్గర్నించి సీతారాములదాకా అన్యోన్యమైన జంటలందర్నీ గుర్తుకు తెచ్చుకుంటారు. మా వీధిలో వాళ్లంతా రామకృష్ణ, రమ్యలను చూసి.

ఒకర్ని విడిచి ఒకరు ఒక్కక్షణం వదలకుండా తిరిగే వాళ్లను చూసి అసూయపడే వాళ్లకు కూడా కొదువేం లేదు.

'మరీ కొంగున ముడేసుకు తిప్పుతుందండీ మొగుణ్ణీ...' అని ఒకావిడ దీర్ఘంతీస్తే, 'అతగాడికే పెళ్లాం ఉన్నట్టు మరీ చోద్యమండీ...' అంటూ పక్క వాద్యం అందిస్తుంది మరో ఆవిడ.

ఎవరేమనుకున్నా మాకు మాత్రం భలే ముచ్చటేసేది ఆ జంటను చూసి. అందుకే వాళ్లతో బాగా చనువూ, అనుబంధమూ పెంచుకున్నాం. వయసులో మాకన్నా బాగా చిన్నవాళ్లవటంచేత ప్రతి చిన్న విషయానికీ మా సలహాలు తీసుకోవడం, మా ఇంటిపిల్లల్లా మా అవసరాలకు సహాయపడ్డం చేస్తూ మాతో అనుబంధం పెంచుకున్నారు.

పిల్లలు ఎవరెవరి ఉద్యోగరీత్యా వాళ్లు దూరప్రాంతాల్లో వుండడంతో వీళ్లతో మా సాన్నిహిత్యం మరీ ఎక్కువైంది.

***

'ఆంటీ! అంకులున్నారా! రమ్య విపరీతమైన కడుపునొప్పితో మెలికలు తిరిగిపోతూంది. డాక్టర్ దగ్గరి కెళ్లాలి. నాకేం తోచడం లేదు' భయంతోనూ, కంగారుతోనూ ఒళ్లంతా చెమటలు పడుతూంటే నా జవాబుకోసం చూడకుండా ఇంట్లోకి చూస్తున్నాడు రామకృష్ణ.

'ఈ పిల్లాడికి మరీ అతి ప్రేమ', ఈగ వాలనివ్వడు ఆ అమ్మాయిమీద' అనుకుంటూ.

'పద రామకృష్ణా! నేనొస్తున్నా. అంకుల్ బజారుకెళ్లాడు' అంటూ పరుగు తీశాను వాళ్లింటి వైపు.

నిజంగానే మెలికలు తిరిగిపోతూంది రమ్య. ఎవరం తెచ్చామో, ఎలా తెచ్చామో, ఎలా చేర్చామో తెలీకుండానే టాక్సీ తెచ్చి హాస్పటల్‌కి తీసుకెళ్లాం. సెల్‌కి ఫోన్‌చేసి ఈయన్ను పిలిపించుకున్నాం. అందరం హాస్పిటల్లో రాత్రంతా జాగారం చేశాం.

తెల్లారేసరికి రమ్య బ్రతుకు తెల్లారిందనే వార్త తెలిసింది. పెదవి విరిచి సారీ చెప్పారు డాక్టర్లు.

గుండె పగిలేలా ఏడ్చాడు రామకృష్ణ. క్రౌంచ మిథునంలో ఒకదాన్ని నేలకూల్చిన నిషాదుని పాపానికి ప్రాయశ్చిత్తం వుందేమోగానీ, ఈ జంటను విడదీసిన విధికి మాత్రం ప్రాయశ్చిత్తం కూడా లేదనిపించింది.

రమ్యను సాగనంపారు ముత్తైదువకు చేసే సకల మర్యాదలతోనూ. ఈ

తంతు చూడలేక స్థాణువై పోయిన నాకు కోలుకోవటానికి చాలారోజులే పట్టింది.

రోజులు గడిచిపోతున్నాయి పగిలినకుండలోని నీళ్లలా. దాదాపు నెలయింది ఇదంతా జరిగి. రామకృష్ణ మా ఇంటివైపు రావడం లేదు. ఇంటి దగ్గరా కన్పించడం లేదు. బాగా షాకయ్యాడు కదా! పాపం ఎక్కడా మనశ్శాంతి లేక తిరుగుతున్నాడనుకుంటాను.

ఒకరోజు వచ్చాడు. గడ్డం బాగా పెరిగి వుంది. కళ్లు లోపలికి పీక్కుపోయి నైరాశ్యానికి ఆలవాలంగా కన్పిస్తున్నాయి. 'ఇల్లు ఖాళీ చేస్తున్నానండీ! రమ్యలేని ఆ ఇంట్లో వుండలేను' అంటూ వెళ్లిపోయాడు.

పిల్లల పరీక్షలూ, మా అనారోగ్యాలూ, ఉద్యోగపు ఒత్తిడులూ అన్నీ కలిపి కాలం మూణ్ణెల్లు ముందుకెళ్లిన విషయాన్ని మరుగున పడేశాయి.

***

'మన రామకృష్ణకో సంబంధం చూశాడోయ్! మా కొలీగ్ శాస్త్రి!' షర్టు హాంగర్‌కి తగిలిస్తూ చాలా కాజువల్‌గా అన్నారు మా వారు.

ఒక్క క్షణం విషయం అర్థం కాలేదు. అర్థమైన మరుక్షణం అపరకాళినే అయిపోయాను.

'ఎవరా శాస్త్రి? వేరే పనేమీ లేదా ఆయనకి? ఎవడి పెళ్లాం పోతుందా రెండో పెళ్లి చేద్దామా అని చూస్తుంటాడా? అసలు రామకృష్ణ గురించి తెలుసా అతనికి. ఆ అమ్మాయి పోయిందన్న షాక్ నించే అతనింకా తేరుకోలేదు. రెక్కతెగిన పక్షిలా విలవిల్లాడుతున్నాడు. ఆ ఇంట్లో వుండలేక ఇల్లు ఖాళీచేసి వెళ్లాడు. రమ్య స్థానంలో మరో అమ్మాయిని అంగీకరిస్తాడా...'

'అది కాదూ... రమ్య పోయినరోజు వచ్చిన వాళ్ల బంధువులెవరో ఈ ప్రపోజల్ తెచ్చారట శాస్త్రి దగ్గర. వాళ్లమ్మాయి వుందనీ... రామకృష్ణ కింకా చిన్న వయసే కనుక తమకు అభ్యంతరం లేదనీ... అన్నారట'.

'ఇకనేం... అక్కడే తాంబూలాలు పుచ్చేసుకుని అప్పుడే రమ్య చితిమంటల సాక్షిగా పెళ్లికూడా చేసెయ్యక పోయారూ మీరూ, మీ శాస్త్రిగారూ కలిసి' అగ్గిమీద గుగ్గిలం అయిపోయాను.

'అపర కాళీ' లా అయిపోయిన నన్ను చూసి కాస్త తగ్గారు. 'అది కాదోయ్! వాడి ఉద్దేశం...'

'ఆ! ఏముందీ! మగాడు... భార్య పోయింది, వెంటనే ఇంకోదాన్ని చూడాలి. అయినా పోయింది తనలో సగమై జీవితాన్ని పంచుకున్న ఇల్లాలండీ. కాలిక్రింది చెప్పు కాదు. తెగిపోతే వెంటనే వేరేది కొనేందుకు.

'అయినా సెంటిమెంట్స్ లేవా మీకు. ఆడదంటే చెప్పులా కన్పిస్తోందా. అయినా అందరూ మీ శాస్త్రిగారిలా, మీలా, ఆ సంబంధం తెచ్చిన వాడిలా ఆలోచిస్తారనుకోకండి. రామకృష్ణ అభిప్రాయం కనుక్కోకుండా మీరే నిర్ణయాలు తీసేసుకోకండి. రామకృష్ణ ఈ పెండ్లికిససేమిరా ఒప్పుకోడు.'

ఇంత ఎదురుగాలి వీస్తుందని తెలీని ఆయన బిక్కమొగం వేశాడు. 'ఈ విషయం నీకు వూరికే చెప్పాను గానీ నాకిందులో ఏ సంబంధమూ లేదోయ్!' అంటూన్న ఆయన్ని చూస్తే జాలేసింది.

తను చెప్పిన వార్త విని ఒక స్త్రీగా రెచ్చిపోయిన మాట వాస్తవమే అయినా నా కోపమంతా ఆయనపై చూపినందుకు కాస్త బాధే అయింది.

***

ఏదో ఆలోచిస్తూ టి వి చూస్తున్నాను. అదేదో ప్రైవేటు ఛానల్. పెండ్లి సంబంధాలు కుదిర్చే కార్యక్రమం ప్రసారమవుతూంది. ఒక పెద్దాయన వచ్చినవాళ్లని ఇంటర్వ్యూ చేస్తున్నాడు. వాళ్ల వూరు, పేరు, కులం, విద్యార్హతలు, ఉద్యోగ వివరాలు, జీతం మొదలైన సమాచారం తన ప్రశ్నల ద్వారా రాబట్టుకుంటున్నాడు. వాళ్ల ఆస్తిపాస్తుల వివరాలు దగ్గర్నించి ఆశిస్తున్న కట్నం వరకూ ఇన్‌డైరెక్టుగా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

'ఆహా! ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ! ఎంత సౌకర్యాన్ని కలిగిస్తున్నావు కదా పెళ్లిళ్ల మార్కెట్ ఇంటి ముంగిట్లో...' ఆలోచిస్తూ యథాలాపంగా టి వి వైపు చూశాను.

కాళ్లకింద భూమి కదిలినట్లైంది. నా నమ్మకాన్ని బూడిదలో పోసిన పన్నీరు చేస్తూ అక్కడ పెళ్లికొడుకు స్థానంలో రామకృష్ణ ట్రిమ్‌గా తయారై నవ్వుతూ తన వివరాలు చెబుతున్నాడు.

రెండో పెళ్లి కనుక అమ్మాయి తనకు నచ్చితే మిగిలిన విషయాల్లో సర్దుకుపోతాడట.

వినలేకపోయాను. తెగినచెప్పు వీధిలో పడేసి వెంటనే కొత్తది కొనేందుకు షాపులో కెళ్తూన్నట్లున్న రామకృష్ణ ముఖం చూడలేక హతాశురాలనై టివి కట్టేశాను.

'తలవంచుకు వెళ్లిపోయావా నేస్తాం సెలవంటూ ఈ లోకాన్ని వదిలి' అని నాతోటి ఆడది రమ్యను తలుచుకుని చెమ్మగిల్లిన కళ్లతో. ■

ఆంధ్రప్రభ

## త్వరలో

## మూలికా వైద్య సలహాలు

**భా**రతీయ వైద్య విధానంలో రకరకాల వైద్యప్రక్రియలు ఆచరణలో ఉన్నాయి. అందులో మూలికావైద్యం ఒకటి. దీనికి సంబంధించి ఒక శీర్షిక నిర్వహించాలని 'ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక' తలపెట్టింది.

ప్రముఖ పాత్రికేయులుగా మూలికా వైద్యులుగా సంచలన రచయితగా ఆంధ్రదేశానికి సుపరిచితులైన కె.ఎస్.వై.పతంజలి ఈ శీర్షిక నిర్వహిస్తారు.

మూలికావైద్యాన్ని తరతరాల వారసత్వంగా పుణికి పుచ్చుకున్న పతంజలి నరాలు, కీళ్ళవ్యాధుల్ని నయం చేయడంలో నిష్ణాతులు. నూటికి తొంభైపాళ్ళు సురక్షితమైన మూలికావైద్యంలోని కీలక అంశాల్ని వివరిస్తూ పాఠకుల సందేహాలకు సమాధానాలు ఇవ్వడానికి పతంజలి అంగీకరించారని తెలియజేయటానికి ఆనందిస్తున్నాం.

మొండి వ్యాధుల మూలాల్ని సమూలంగా నిర్మూలించగల మూలికా వైద్యం గురించిన మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా:

**కె.ఎస్.వై. పతంజలి,**
**507, సీతారామయ్య టవర్స్,**
**మీటరు ఫ్యాక్టరీ రోడ్డు,**
**ఎర్రగడ్డ, హైదరాబాద్.**

ఎడిటర్